క్లుప్తంగా

ఉప్పాడ నుంచి పిఠాపురం శ్రీపాద క్షేత్రానికి పాదయాత్ర


ఉప్పాడ నుంచి పిఠాపురం దత్త క్షేత్రానికి పాదయాత్ర చేస్తున్న దత్త స్వాములు

కొత్తపల్లి: మండలంలో దత్త జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పాడలో దత్తమాల ధరించిన 45 మంది స్వాములు ఇరుముడి కట్టుకుని పాదయాత్రగా పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ మాలను ధరించి 41 రోజుల పాటు కఠోర దీక్ష చేశామని స్వాములు తెలిపారు.

ప్రారంభం కానున్న కల్యాణ మండపం పనులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని రాయుడుపాలెంలో కాపు కల్యాణ మండపం నిర్మాణ పనులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చొరవతో తిరిగి ప్రారంభం కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న కాపు కల్యాణ మండపం నిర్మాణాన్ని పూర్తి చేయాలని శ్రీబాల గణపతి కాపు సేవా సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ఇటీవల విజ్ఞప్తి చేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో కాపు సంఘ నేతలతో కలసి మండల ఇంజనీరు వాసుదేవరావు సోమవారం అసంపూర్తి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీబాల గణపతి కాపు కల్యాణ మండపం జనవరి నెలాఖరులోగా పూర్తి చేస్తామని ప్రతినిధులు లింగం రవి, ఉప్పులూరి బుల్లయ్య, వెజ్జపురెడ్డి ఏసుబాబు, గాదె చక్రరావు తదితరులు మీడియాకు వెల్లడించారు. మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కన్నబాబుకు వారు ధన్యవాదాలు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం తనవంతుగా రూ.25 వేల చెక్కును వైఎస్సార్ సీపీ నేత, సంఘ గౌరవాధ్యక్షుడు లింగం రవి అందజేశారు.

వినియోగదారులకు అనుకూలంగా చట్టాలు


సదస్సులో మాట్లాడుతున్న కొమ్మూరి శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: వినియోగదారులకు అనుకూలంగా చట్టాలున్నాయని జిల్లా వినియోగదారుల ప్రొటెక్షన్ కౌన్సిల్ సభ్యుడు కొమ్మూరి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏ వస్తువు కొన్నా లేదా నగదు చెల్లించి ఏ సేవ పొందినా, వాటిలో లోపాలుంటే మన ప్రాంతంలోనే ఫిర్యాదు చేసే అవకాశాన్ని చట్టం కల్పించిందన్నారు. ఫిర్యాదు చేసిన 120 రోజుల్లోగా పరిష్కారం లభిస్తుందని, 1915, 1800–14000కు నేరుగా ఫోన్‌కాల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు పాల్గొన్నారు.

బాలత్రిపుర సుందరి ఆలయానికి రంగులు

బోట్‌క్లబ్: బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి దాతల సహకారంతో రంగులు వేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రంగులు వేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఆలయంలో రంగులు వెలసిపోవడంతో దాతల సహకారంతో ఆలయం మొత్తం రంగులు వేయనున్నట్టు చెప్పారు. రంగులు వేసేందుకు ముందుకు వచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పొగమంచుతో ఇక్కట్లు


పొలాలను కమ్మేసిన పొగమంచు

ప్రత్తిపాడు: గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం పొగ మంచు కురుస్తోంది. మంచు ఎక్కువగా ఉండడంతో రోడ్లపై వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ చలి తీవ్రత తగ్గడం లేదు. గత రెండు రోజులుగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రత్తిపాడు మండలంలో సోమవారం 17 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8.30 గంటలు దాటినా సూర్యుడి జాడ కనిపించడం లేదు. దీంతో ప్రజలు స్వెట్టర్లు, జర్కిన్లు వేసుకునే ఇంటి నుంచి బయటకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక ఉదయాన్నే పనుల కోసం వెళ్లే వారు చలి తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు.


దివిలి క్రిస్మస్ ఆరాధనలో ప్రసంగిస్తున్న పాస్టర్ నంగిన సత్యానందం


గ్రామాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు


ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో పేదలకు వస్త్రదానం చేసిన సంఘ నాయకులు, పాస్టర్ తదితరులు


కాశివారిపాకలలో చిన్నారుల వేషధారణలు


కొండెవరంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వైభవంగా క్రిస్మస్ వేడుకలు

- కిటకిటలాడిన చర్చిలు, ప్రార్థనా మందిరాలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు
- ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శనలు
- జోరుగా సేవా కార్యక్రమాలు

పెద్దాపురం: సమూల పాపాలను కడిగి.. బాధాతప్త హృదయాల కన్నీరు తుడిచేందుకు ఈ భువి మీద అవతరించిన క్రీస్తు పుట్టిన రోజు వేడుకలు మిన్నంటాయి. ప్రతి విశ్వాసిని అక్కున చేర్చుకుని.. ప్రేమను పంచేందుకు తన రక్తాన్ని ధారపోసిన క్రీస్తు రాకను పురస్కరించుకుని.. వాడవాడలా, గ్రామగ్రామాన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి విశ్వాసి క్రీస్తును ఆరాధించడమే అసలైన క్రిస్మస్ అని క్రీస్తు శాంతి ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, క్రిస్టియన్ గాస్పెల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అన్నారు. క్రిస్మస్ ఆరాధనల్లో భాగంగా సోమవారం మండలంలోని దివిలి, చదలాడ, తిరుపతి, కాండ్రకోట, పిఠాపురం మండలం విరవ గ్రామాల్లోని క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా చర్చిల్లో ప్రసంగిస్తూ క్రిస్మస్ అంటే కేవలం వేషధారణ సంబరం కాదని, అసలైన క్రీస్తును ఆరాధించడమేనన్నారు. ప్రతి వ్యక్తి ఎప్పుడైతే పూర్తి క్రీస్తును ఆరాధిస్తాడో అప్పుడే అసలైన క్రిస్మస్ జరిగినట్టని శామ్యూల్ సుదీప్ అన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులను అలరిస్తూ క్రైస్తవ గీతాలు ఆలపించారు. భారీ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. వేకువజామున సండే స్కూల్ విద్యార్థులు క్రీస్తు నేడు పుట్టెను హల్లెలూయ అంటూ నినాదాలతో గ్రామగ్రామాన భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, మేరీ, విశాల, ఆయా గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.


పిఠాపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

నేడు శాంతివర్ధనలో క్రిస్మస్ ఆరాధన

పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ఈ నెల 26న క్రిస్మస్ ఆరాధన నిర్వహించనున్నట్టు పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు, ప్రిన్సిపాల్ సత్య తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 9 నుంచి విభిన్న ప్రతిభావంతుల విద్యార్థుల మధ్య క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకలకు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కుటుంబ సమేతంగా హాజరై, విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల మధ్య ప్రేమవిందు స్వీకరిస్తారన్నారు. విభిన్న ప్రతిభావంతుల సాంస్కృతిక కార్యక్రమాలు, క్రైస్తవ గీతాలాపన ఉంటుందన్నారు.

పిఠాపురం: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పిఠాపురం పట్టణంతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే క్రైస్తవులు క్రీస్తు నేడు పుట్టెను అనే నినాదాలతో గ్రామాల్లో పర్యటించారు. ఉదయం నుంచి అన్ని చర్చిల్లోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రార్థన మందిరాలు జనంతో కిటకిటలాడాయి. విద్యార్థులు, చిన్నారుల వేషధారణలు చూపరులను అమితంగా ఆకర్షించాయి. పిఠాపురం ఆంధ్రాబాప్టిస్ట్ సెంటినరీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే పెండెం దొరబాబు పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిఠాపురంలోని తన కార్యాలయంలో కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండలంలోని సుమారు 150కిపైగా చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి అన్ని చర్చిలు విశ్వాసులతో కిటకిటలాడాయి. మండలంలోని ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట, కొత్తపల్లి, వాకతిప్ప, యండపల్లి, కుతుకుడుమిలి గ్రామాల్లోని చర్చిల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు, నాటికలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. చిన్నారుల వేషధారణలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి.


కొండెవరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ఉప్పాడలో చర్చిలో విజేతలకు బహుమతులు ఇస్తున్న పాస్టర్లు

పోలీసు స్టేషన్‌లో క్రిస్మస్ వేడుకలు

సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వస్త్రదానం

క్రిస్మస్‌ను పురస్కరించుకుని స్థానిక ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో పేదలకు వస్త్రదానం చేశారు. చర్చి అధ్యక్షుడు బీఎస్ వందనం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ బి.కిరణ్‌కుమార్ వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, పాలిక కుసుమ, సంఘ కార్యదర్శి టి.సూర్యారావు, కోశాధికారి జి.అన్నపూర్ణ పాల్గొన్నారు.


సామర్లకోట పోలీసు స్టేషన్‌లో కేక్ కట్ చేసిన సీఐ సురేష్, సిబ్బంది


తిరుపతి క్రిస్మస్ ఆరాధనలో ప్రార్థనలు నిర్వహిస్తున్న చిన్నారులు


పిఠాపురం చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు


గోకివాడలో విద్యార్థుల వేషధారణలు

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

- మొత్తం 1,495 మంది క్రీడాకారులు
- జూనియర్ కాలేజి, హైస్కూళ్లలో పోటీలు

సామర్లకోట: గ్రామీణ స్థాయిలో యువతీ, యువకుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పట్టణ, మండల పరిధిలో సోమవారం నుంచి క్రీడలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 1,495 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. పట్టణ సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు క్రికెట్ 25 మ్యాచ్‌లకు 550 మంది, బ్యాడ్మింటన్ 32 మ్యాచ్‌లకు 320 మంది, కబడ్డీ ఆరు మ్యాచ్‌లకు 84 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఈ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రారంభిస్తారని చెప్పారు. సచివాలయ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

గ్రామాల నుంచి 541 మంది

మండలంలోని 18 గ్రామాలకు సంబంధించిన 21 సచివాలయాల నుంచి 541 మంది క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రాలో పాల్గొంటున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. ఆయా సచివాలయాల సమీపంలో ఉన్న హైస్కూళ్లలో మంగళవారం నుంచి 28వ తేదీ వరకు ఆటల పోటీలు జరుగుతాయన్నారు. పురుషుల విభాగం నుంచి క్రికెట్‌లో 113 మంది, మహిళల నుంచి ఏడుగురు, బ్యాడ్మింటన్‌కు పురుషుల నుంచి 127 మంది, మహిళల నుంచి 106 మంది, వాలీబాల్‌కు పురుషుల నుంచి 39 మంది, మహిళల నుంచి ఇద్దరు, ఖోఖోకు పురుషుల ఉంచి నలుగురు, మహిళల 57 మంది ఆడుతున్నారని వివరించారు.ఆయా పోటీల్లో గెలుపొందిన వారిని మండల స్థాయి పోటీలకు ఎంపిక చేసి, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 29 నుంచి జనవరి 6 వరకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.


సచివాలయ సిబ్బందికి ఆడుదాం ఆంధ్రా కిట్లు అందజేసిన కమిషనర్, చైర్‌పర్సన్

క్రీస్తు ఆశీస్సులు అందరికీ ఉండాలి

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన దవులూరి దొరబాబు

సామర్లకోట: శాంతికి, ప్రేమకు, త్యాగానికి ప్రతిరూపమైన ఏసు క్రీస్తు ఆశీస్సులు అందరికీ ఉండాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ప్రపంచ దేశాలు జరిపే పండగ క్రిస్మస్ అంటూ క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పట్టణంలోని చర్చిల్లో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు జననం ప్రాధాన్యాన్ని వివరించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. స్థానికుడైన తనకు వైఎస్సార్ సీపీ నుంచి పెద్దాపురం ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని, తనకు, జగన్‌మోహన్‌రెడ్డికి క్రైస్తవుల ఆశీస్సులు ఉండాన్నారు. పట్టణంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి, ఆంధ్రా బాప్టిస్టు చర్చి, సెంటినరీ అగస్థానా లూథర్ చర్చి, సాలెమ్ బాప్టిస్టు చర్చి, పెద్దాపురం లూథరన్ చర్చిలకు దొరబాబు హాజరై, క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా చర్చిల పాస్టర్లు ప్రార్థనలు చేసి, ఆశీర్వచనాలు అందజేశారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు బైబిల్‌లో వచనాలను చెప్పడంతో పాటు క్రీస్తు పాటలు పాడి క్రైస్తవులను మరిపించారు. సెంటినరీ బాప్టిస్టు చర్చి, ఆంధ్రా బాప్టిస్టు చర్చి, అగస్థాన లూథరన్ చర్చి, సాలెమ్ బాప్టిస్టు చర్చి, ఆర్‌సీఎం చర్చిలతో పాటు అన్ని చర్చిల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. స్థానిక సంత మార్కెట్‌లోని సెంటినరీ చర్చిలో పాస్టర్ కిరణ్‌బాబు, ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో పాస్టర్ బి కిరణ్‌కుమార్, సాలెమ్ బాప్టిస్టు చర్చిలో పాస్టర్లు సాల్మన్‌రాజు, కృపాకర్, అగస్థాన లూథరన్ చర్చిలో పాస్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రార్థనలు జరిగాయి. ఆయా చర్చిల్లో చైర్‌పర్సన్ అరుణ, వైస్ చైర్మన్లు ఊబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మున్సిపల్ కోప్షన్ సభ్యుడు సుబ్బారావు, కౌన్సిలర్లు పిట్టా సత్యనారాయణ, పాలిక కుసుమచంటి, రెడ్డి లోవకుమారి, పాలిక కుసుమచంటి, నేతల హరిబాబు, కానేటి రాజేశ్వరి, క్రిస్టియన్ మైనార్టీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, వైఎస్సార్ యువసేన జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు, కానేటి అప్పారావు పాల్గొన్నారు. అదే విధంగా టీడీపీ, జనసేన నాయకులు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ కావడంతో పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చర్చిల్లో సోమవారం సందడి నెలకొంది. చర్చిలను విద్యుద్దీపాలతో, బెలూన్లతో అలంకరించారు.


సామర్లకోట చర్చిలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న దవులూరి దొరబాబు

దిగంబరా.. శ్రీపాదవల్లభ దిగంబరా


పిఠాపురంలో దత్త స్వాముల గ్రామోత్సవం

- ఘనంగా దత్త జయంతి వేడుకలు
- కన్నుల పండువగా స్వామివారి తెప్పోత్సవం

పిఠాపురం: దత్తాత్రేయుడి జన్మస్థలంగా పేరొందిన పిఠాపురంలో దత్త జయంత్యోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పాదగయ క్షేత్రంలో వెలసిన దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేలాది మంది దత్తస్వాములు, భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంతో పాటు అనఘాదత్త క్షేత్రం, శ్రీగోపాల్‌బాబా ఆశ్రమం వంటి పుణ్య క్షేత్రాల్లో దత్త జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దత్త జయంతి సందర్భంగా పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. దత్తస్వాములు ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమించారు. సాయంత్రం పాదగయ పుష్కరిణిలో స్వామి వారి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. వందలాది మంది భక్తులు తిలకించి తరించారు.


విశేష అలంకారంలో శ్రీపాద శ్రీవల్లభ స్వామివారు

తాటాకిళ్లు దగ్ధం

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో సోమవారం సాయంత్రం రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొంప వెంకటరమణ, గొంప సత్యనారాయణ, రుత్తల నాగరాజు, రుత్తల రమణ, రుత్తల శ్రీను, రుత్తల సత్యవతి కుటుంబాలు రెండు వసారా తాటాకిళ్లలో నివాసం ఉంటున్నాయి. కాగా సోమవారం వంట చేస్తున్న సమయంలో మంటలు చెలరేగి ఇంటికి నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రి, నిత్యావసరాలు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు తుని ఫైర్ ఆఫీసర్ కె.రాముడు తన సిబ్బందితో వచ్చి మంటలు అదుపు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు బాధితులను పరామర్శించారు.


అల్లిపూడిలో కాలిపోతున్న తాటాకిళ్లు

ఘనంగా రాజశ్యామల హోమం

బోట్‌క్లబ్: వేద విజ్ఞాన ప్రతిష్ఠానం ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో సోమవారం రాజశ్యామల హోమాన్ని ప్రతిష్ఠానం ఉపాధ్యక్షుడు పుసులూరి మణిశర్మ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. వేద విజ్ఞాన ప్రతిష్ఠానంలో ప్రతినెలా విశేష తిథుల్లో హోమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలందరూ సుఖశాంతులతో జీవించడమే కాక, వారి సమస్యలు పరిష్కారమయ్యేందుకు ఇటువంటి హోమాది కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ప్రతిష్ఠానం వ్యవస్థాపకులు చెరుకుపల్లి లక్ష్మీనృసింహ శర్మను స్మరించుకుంటూ ఈ విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రతిష్ఠానం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి వేడుకలు

పిఠాపురం: మాజీ ప్రధానమంత్రి, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి 100వ జయంతి వేడుకలను సోమవారం పిఠాపురం నియోజకవర్గంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పిఠాపురంలో వాజ్ పేయి చిత్రపటానికి బీజేపీ నేతలు బుర్ర కొండలరావు, గండి కొండలరావు, పసుపులేటి సత్యనారాయణ, దాట్ల వెంకటసూర్యనారాయణరాజు, వాసంశెట్టి శ్రీనివాసు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పిల్లా ముత్యాలరావు, జీలకర్ర సత్తిబాబు, అడబాల శ్రీనివాసు పాల్గొన్నారు. గొల్లప్రోలులో వాజ్‌పేయి చిత్రపటానికి బీజేపీ నేతలు చిట్టా మధు, ఉలవలశెట్టి శ్రీను, ఎం.నారాయణరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు రగ్గులు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.


పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రగ్గులు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

క్రీడాస్ఫూర్తిని చాటేలా 'ఆడుదాం ఆంధ్రా'

ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని క్రీడాస్ఫూర్తిని చాటేలా పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పండగ ఏర్పాట్లను కమిషనర్ ఆయా అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. స్థానిక ఆనంద భారతి గ్రౌండ్స్ ఈ క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్, కాకినాడ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ కృతికా శుక్లా, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ప్రారంభిస్తారని కమిషనర్ చెప్పారు. ఐదు క్రీడాంశాల్లో జరిగే ఈ ఆడుదాం ఆంధ్రా పోటీలకు కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో సుమారు 23 వేల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. సచివాలయాల పరిధిలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయికి, ఆ తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా పరికరాలతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు కూడా అందిస్తామన్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న క్రీడాకారులు ఉత్సాహంగా పోటీలకు హాజరుకావాలని సూచించారు. నగర పాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, పలువురు అధికారులు కమిషనర్ వెంట ఉన్నారు.